

నేడు ఇంటర్ ఫలితాలు..

- పరీక్ష రాసిన 9,317 మంది విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షల ఫలితాలను విడుదల చేయనుంది. దీంతో జిల్లాలో పరీక్షకు హాజరైన 9317 మంది విద్యార్థుల భవితవ్యం తేలనుంది. మార్చి 5న ప్రారంభమైన వార్షిక పరీక్షలు మార్చి 25న ముగిసాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3195మంది కాగా ఒకేషనల్‌లో 1199మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3716, ఒకేషనల్ విద్యార్థులు 1206 మొత్తం 9317మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందుకు గాను జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. వార్షిక ఫలితాలు వెలువడుతాయనే ప్రకటనలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

నేడు ఎల్కతుర్తికి కేటీఆర్ రాక



ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను పరిశీలించేందుకు గాను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి రానున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో రానున్న ఆయన సభా ప్రాంగణం, వేదిక తదితర ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అనంతరం బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశమవుతారని, సభ నిర్వహణ, ప్రజల రవాణా సౌకర్యాలపై దిశానిర్ధేశం చేస్తారని తెలుస్తోంది.



శాఖల వారీగా బకాయిలు ఇలా..

కార్యాలయం	మొత్తం బిల్లు	వసూలు	పెండింగ్
జనరల్ అడ్మినిస్ట్రేషన్	11.05	1.08	09.97
పోలీస్‌శాఖ	48.74	0.24	48.50
వైద్య ఆరోగ్య శాఖ	21.50	--	21.50
రెవెన్యూ శాఖ	58.31	5.45	52.86
ఉన్నత విద్యాశాఖ	12.53	7.23	5.30
సాంఘిక సంక్షేమం	10.61	4.19	6.61
బీసీ సంక్షేమం	2.23	1.33	1.81
ప్రభుత్వ పాఠశాలలు	78.73	9.99	68.74
గిరిజన సంక్షేమం	10.31	6.56	3.75
మత్స్యశాఖ	0.66	0.14	0.53
మార్కెటింగ్‌శాఖ	0.27	--	0.27
మొత్తం :	2.39కోట్లు	36.21లక్షలు	2.02కోట్లు

బకాయిల భారం

ప్రభుత్వ ఆఫీసుల్లో విద్యుత్ బిల్లులు పెండింగ్

జిల్లాలో మొత్తం రూ.2.39 కోట్లు

- వసూలు చేసింది రూ.36.21 లక్షలు మాత్రమే
- వసూలు చేయాల్సింది. రూ.2.02 కోట్లు

మహబూబాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. జిల్లాలో గత కొన్నేళ్లగా ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ శాఖకు వారు వినియోగించుకున్న విద్యుత్‌కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో రూ. కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. జిల్లాలోని 11 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 1243 విద్యుత్ సర్వీస్‌ల ద్వార రూ.2.39కోట్లు విద్యుత్ బిల్లులు బకాయిలో ఉన్నాయి. నేటి వరకు రూ. 36.21 లక్షలు మాత్రమే వసూలు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో విద్యుత్ బకాయిలు ఇంకా భారీ మొత్తంలో వసూలు చేయాల్సి ఉంది. పెండింగ్ బిల్లుల్లో వసూలు చేసిన బకాయిలు పోగా ఇంకా రూ. 2.02 కోట్ల బకాయి వసూలు చేయాల్సి ఉంది.

వసూలు చేసింది గోరంత.. చేయాల్సింది కొండంత..

ప్రభుత్వ శాఖలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు వసూలుచేసింది.. గోరంత అయితే. ఇంకా చేయాల్సింది మాత్రం కొండంత ఉంది. ఐదేళ్లగా ఆయా శాఖలు బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ బకాయిలు భారీగా పెరిగాయి. విద్యుత్ వినియోగదారులు ప్రతినెల వారు వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు చెల్లిస్తారు. ఒక్క నెల బిల్లులు ఆలస్యమయితేనే మరో నెలలో అదనపు బిల్లుతో మోత మోగుతుంది. అప్పటికీ కట్టకుంటే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. అలాంటిది ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రం లక్షలాది రూపాయలు బకాయిలు పడ్డాప్పటికి వాటిని వసూలు చేయడంలో విద్యుత్‌శాఖ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. 11 శాఖల కార్యాలయాల్లో సుమారు 2.39 కోట్లు బకాయిలుఉండగా అందులో కేవలం రూ.36 లక్షలు మాత్రమే వసూలు కాగా, ఇంకా రూ.2 కోట్ల పై చిలుకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో రూ.78.73 లక్షలు పెండింగ్ ఉండగా.. అత్యల్పంగా మార్కెటింగ్‌శాఖ రూ.22 వేలు మాత్రమే బకాయిలు ఉన్నాయి.

ప్రభుత్వ అధికారులకు నోటీసులు అందజేశాం..

జె.నరేష్, జిల్లా విద్యుత్‌శాఖ అధికారి

జిల్లాలో 11ప్రభుత్వ కార్యా లయాల అధికారులకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలని నోటీసులు పంపించాం. విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించి విద్యుత్‌శాఖకు తోడ్పాటునందించాలి. నోటీసులు పంపించిన తర్వాత కూడ బిల్లులు చెల్లించని కార్యాలయాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

బీజేపీది గాడ్సే సిద్ధాంతం

- అదానీ, అంబానీలకు రూ.21లక్షల కోట్లను మాఫీ చేశారు
- రైతులకు రుణమాఫీ చేయడానికి చేతులు రాలేదు
- స్వేచ్ఛ, సమానత్వాల పరిరక్షణకు రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి
- ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపులో మంత్రి సీతక్క

7

ఎనిమిది మంది తహసీల్దార్లకు స్థానచలనం

- 33 మంది సీనియర్, జూనియర్, అసిస్టెంట్ల బదిలీలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని 18మండల పరిధిలోని 8మంది తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్వీ నారాయణమూర్తి సీరోలు తహసీల్దార్‌గా వెళ్లగా.. సీరోలు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.శారదను గార్ల తహసీల్దార్‌గా బదిలీచేశారు. కేసముద్రం తహసీల్దార్ దామోదర్‌ను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా, కురవి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సునీల్‌కుమార్ దంతాలపల్లి తహసీల్దార్‌గా, దంతాలపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రరాజేశ్వర్‌రావును గూడూరు తహసీల్దార్‌గా, గూడూరులో విధులు నిర్వహిస్తున్న స్వాతిని కురవి తహసీల్దార్‌గా, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.రవీందర్‌ను ఇనుగుర్తి తహసీల్దార్‌గా బదిలి చేశారు. కేసముద్రం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రయ్యకు కేసముద్రంలో పదోన్నతిపై తహసీల్దార్‌గా బదిలీ చేశారు. గార్ల తహసీల్దార్ గా విధులు నిర్వహించిన కృష్ణవేణికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. మరోపక్క 33 మంది సీనియర్, జూనియర్, అసిస్టెంట్‌లకు స్థానచలనం చేస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

వడదెబ్బతో మహిళా రైతు మృతి

చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఘటన

- ఇది వడదెబ్బ మృతికాదు.. ప్రభుత్వ హత్యే
- కొనుగోళ్లలో ఆలస్య వల్లే మరణం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

6



ప్రేమలత మృతదేహం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ రాంచందర్‌నాయక్

భూ భారతి.. దేశానికే ఆదర్శం

- రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కురవి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతిచట్టం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. కురవి మండలం కందికొండ, సీరోలు మండలం చింతపల్లిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించగా ప్రతీ క్వింటాకు రూ. 500 బోనస్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ రైతు భరోసా అమలుచేస్తూ రైతుపక్షపాతిగా ప్రజాప్రభుత్వం నిలిచిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మానుకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, సీరోలు, కురవి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అంబటి వీరభద్రం, నాయకులు బండి శ్రీను, జెర్రిపోతుల మహేష్, చందులాల్, సైదులు, మూడు రవీందర్, అశోక్, యాకయ్య పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించితేనే దేశంలో మతసామరస్యం

- నల్లచట్టాల రద్దుకు రైతులు ఉద్యమించిన తరహాలో ముస్లీంలూ పోరాడాలి
- వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేసేంత వరకు ఉద్యమాలు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్
- వక్ఫ్ సవరణ బిల్లు రద్దు కోసం మానుకోటలో కదం తొక్కిన ముస్లీంలు



మహబూబాబాద్‌లో ముస్లింలకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ బలరాం, ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

మహబూబాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీని గద్దె దించితేనే దేశంలో శాంతి నెలకొనడంతో పాటు మత సామరస్యం పరిడవిల్లుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. వక్ఫ్‌సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వక్ఫ్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముస్లీంలు భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక వివేకానంద సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతు, ముస్లీం, ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందని విమర్శించారు. రాజ్యాంగంపై దాడులు చేస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌ను అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నల్లా చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన తరహాలో వక్ఫ్ సవరణ బిల్లు రద్దు అయ్యేంత వరకు ముస్లీంలు పోరాడాలని వారికి న్యాయం జరిగేంత వరకు తాము వెంట ఉంటామని స్పష్టం చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజలను విభజించి పాలించడమే బీజేపీ సిద్ధాంతమని మానుకోట ఎంపీ పోరిక బలరాం నాయక్ విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం బీజేపీ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంటులో కాంగ్రెస్ వాకౌట్ చేసిందని గుర్తు చేశారు. మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డులను ఆస్తులను కైవసం చేసుకునేందుకు కేంద్రప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చిందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో వక్ఫ్ పరిరక్షణ కమిటీ జిల్లా చైర్మన్ ఎమ్డీ, ఇక్బాల్, ఎమ్డీ ఫరీద్, ఖలీల్ పాషా, ముఫ్తీ అలంఘీర్, హాఫీజ్, అబ్దుల్ హమిద్, హాఫీజ్, సయీద్ అమ్మద్ రిజ్వీ, వాహెద్, అనీఫ్ అలీ, చాంద్, సలీం, జాకీర్, రహీం, నజీర్, నదీంఖాన్, సత్తార్, ఇస్మాయిల్, అసద్ అలీఖాన్, రియాజ్ అన్సారీ, వీరికి మద్దతుగా రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు బి.విజయసారథిరెడ్డి, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, డాక్టర్ డోలి సత్యనారాయణ, పిల్లి సుధాకర్, గుగ్గిళ్ల పీరయ్య, మైస శ్రీనివాస్, వివేక్, గుగులోతు బీమా నాయక్, దుడ్డెల రాంమూర్తి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ..

కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ముస్లీంలు కదం తొక్కారు. వక్ఫ్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముస్లీంలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్ ఆఫీస్ ఎదుట ప్రారంభమైన ర్యాలీ నెహ్రూ సెంటర్, ఆర్యూబీ గుండా, మదర్ థెరిస్సా సెంటర్ నుంచి వివేకానంద సెంటర్ వరకు కొనసాగింది. వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని ముస్లీంలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఎండను సైతం లెక్క చేయకుండా ముస్లీంలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వారికి మద్దతుగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే కొత్త చట్టం

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- ధరణి ద్వారా రైతులకు న్యాయం చేయలేకపోయిన అధికారులు
- అడిషనల్‌కలెక్టర్ (రెవెన్యూ) వీరబ్రహ్మాచారి



కొత్తగూడలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

కొత్తగూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూభారతి న్యూ ఆర్‌వోఆర్ చట్టం-2025 అని, దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి భూ భారతి న్యూ ఆర్‌వోఆర్ చట్టం-2025 ద్వారా న్యాయం జరుగుతుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పేర్కొన్నారు. ధరణి పోర్టల్ ద్వారా సామాన్య రైతులకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేకపోయారని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) వీరబ్రహ్మాచారి పేర్కొన్నారు. కొత్తగూడలోని రైతువేదికలో సోమవారం భూభారతి న్యూ ఆర్‌వోఆర్ చట్టం-2025పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్ఠాత్మకంగా భూభారతి న్యూ ఆర్‌వోఆర్ చట్టం- 2025 తీసుకువచ్చిందన్నారు. రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తులకు పరిష్కారం చూపే విధంగా కొత్త చట్టం ఉంటుందన్నారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ ధరణి పోర్టల్ ద్వారా సామాన్య రైతులకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేకపోయారని పేర్కొన్నారు. రైతులు ప్రతి చిన్న విషయాలకు కోర్టులను ఆశ్రయించేవారని పేర్కొన్నారు. వారసత్వం, ఏజెన్సీ భూహద్దులు తదితర అంశాలపై ప్రజలకు పూర్తి న్యాయం భూభారతి ఆర్‌వోఆర్ చట్టం -2025 ద్వారా జరుగుతుందని పేర్కొన్నారు. కాగా గిరిజనేతరుల భూములకు హక్కులు కల్పించాలని గిరిజనేతరులు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను కోరారు. సదస్సులో ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్, ఏవో ఉదయ్, వైద్యుడు శ్రీకాంత్, డీటీ పద్మవతి, పరమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కారోజు రమేష్, బిట్ల శ్రీనివాస్, కాడబోయిన జంపయ్య, ముస్కు వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

- గంగారం (ఆంధ్రజ్యోతి) :పేదోడి భూములకు రక్షణగా భూ భారతి ఆర్వోఆర్ 2025 చట్టం నిలుస్తుందని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. గంగారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తొలుత జాతీయ గీతం ఆలపించిన తర్వాత ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ధరణి పోర్టల్‌లో వివాదస్పద అంశాలను తొలగించిన ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా భూ భారతి చట్టం తీసుకువచ్చి కొన్ని సవరణలు చేయడం వల్ల పేదోడి భూములకు రక్షణగా ఈ చట్టం నిలిచిం దన్నారు. ఈ కొత్త చట్టం వల్ల రైతుల చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అనువుగా ఉందన్నారు. పోర్టల్‌లో చిన్న చిన్న తప్పులను కూడా సరిచేసుకునే వెసులు బాటు కల్పించారని అన్నారు. రైతులు వారి సమస్యలను వారికి ఉన్న భూ హక్కులతో దరఖాస్తు చేసుకుంటే విచారణ చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె. వీరబ్రహ్మాచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణ వేణి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాతో ఒప్పందం వ్యవసాయానికి ప్రమాదం

ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న మండల వెంకన్న

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భారత్, అమెరికా స్వేచ్ఛ, వాణిజ్యం పేరుతో వ్యవసాయ రంగానికి, పాడిపరిశ్రమ, మత్స్యరంగానికి నష్టం చేసే ఒప్పందాలు చేసుకుంటే ఇది భారత రైతాంగానికి ఉరితాళ్లుగా మారుతాయని కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్, అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా ఉపాధ్యక్షులు వాన్స్ భారత్ రాకకు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అమెరికాతో ఒప్పందాలకు దేశ వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలకు అప్పగించేందుకు మోదీ దేశద్రోహానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎస్కేఎం నేతలు గుజ్జు దేవేందర్, చింతకుంట్ల వెంకన్న, నల్ల సుధాకర్, బండపల్లి వెంకటేశ్వర్లు, సత్యం, నిజాముద్దీన్, నాగేశ్వర్‌రావు, వెంకన్న, పాపయ్య పాల్గొన్నారు.



గవిచర్ల గ్రామంలో పర్యటిస్తున్న స్వర్ణ

రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ పౌరుడి బాధ్యత

కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ

సంగెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ పౌరుని బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చెప్పారు. సోమవారం మండలంలోని గవిచర్ల గ్రామంలో మండల పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలను అమలు చేయడంలో ప్రముఖ పాత్రను పోషించాలని అన్నారు. ప్రతీ గ్రామంలోని ప్రతీ ఒక్కరు రాజ్యాంగానికి జరుగుతున్న ప్రమాదాలను వివరించాలన్నారు. అహింసా పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన నాటి పోరాట యోధులను గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు రమేష్, జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ, మండల మహిళ అధ్యక్షురాలు సంధ్య, మార్కెట్ కమిటీ డైరక్టర్లు అచ్చ నాగరాజు, నర్సింహనాయక్, పాష, జగన్నాథ చారి, బానిపాక సదయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి మాత విగ్రహం తయారీ పూర్తి

మహదేవపూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు మహా బలిపురంలో వీఐపీ ఘాట్ వద్ద నిర్మిస్తున్న సరస్వతి అమ్మవారికి విగ్రహం తయారీ పూర్తయ్యింది. దాదాపు నెలరోజుల కింద ఈ విగ్రహానికి ఆలయ అధికారులు బలిపురానికి వెళ్లి అమ్మవారి విగ్రహానికి ఆర్డర్ ఇచ్చారు. అయితే విగ్రహం తయారీ పూర్తయిందని దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ నెల 30న విగ్రహాన్ని కాళేశ్వరం తీసుకురానునట్టు తెలిసింది. వీఐపీ ఘాట్ వద్ద భక్తులు స్నానాలు ఆచరించి సరస్వతి విగ్రహాన్ని దర్శించుకుని కాళేశ్వరాలయానికి వెళ్తారు.

కొండపర్తిలో గవర్నర్ కార్యదర్శుల బృందం

అభివృద్ధి పనుల పరిశీలన

తాడ్వాయి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ దత్తత తీసుకున్న గ్రామం కొండపర్తిని ఆయన ప్రత్యేక కార్యదర్శులు భవాని శంకర్, పవన్ సింగ్, గోవిందదాస్ సోమవారం సందర్శించారు. అధికారులతో కలిసి అభివృద్ధి పనులు, బహుళ ఉపయోగ యంత్రాలను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహుళ ఉపయోగాల యంత్రాలు మసాల తయారీ యూనిట్, టైలరింగ్ సెంటర్‌ను సందర్శించారు. మహిళా సంఘం సభ్యులతో సమావేశమై ఆయా యూనిట్ల ఉపయోగాలు, సమస్యలు, అవసరాలు అడిగి తెలుసుకున్నారు. మసాల యునిట్ అభివృద్ధి చేయడానికి వృత్తి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మధుకర్‌తో పలు అంశాలపై మాట్లాడారు. ఇంకా కావల్సిన అవసరాలు, మార్కెటింగ్ ఏర్పాట్లు, పనుల విధానం అడిగి తెలుసుకున్నారు. మిర్చి, పసుపు కొనుగోలు చేయడానికి, నిల్వా చేయడానికి మరింత అధిక వనరులు, సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సంస్థ అధ్వర్యంలో మసాలాలు గ్రైండింగ్ చేయడం, టైలరింగ్ శిక్షణ తరగతులు కొనసాగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఈఈ వీరభద్రం, వృత్తి సంస్థ విలేజ్ కోఆర్డినేటర్ సూదికొండ గణేష్, సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుళ ఉపయోగ యంత్రాలను పరిశీలిస్తున్న గవర్నర్ సెక్రటరీల బృందం

రాష్ట్రాన్ని ఆగం చేస్తే కేసీఆర్ ఊరుకోరు

- కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ పాలన
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభా స్థలం పరిశీలన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు ఆగం చేస్తుంటే.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చూస్తూ ఊరుకోరని, ఆయన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ నెల 27న సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్ కుమార్, సభ ఇన్‌చార్జ్ బాలమల్లుతో కలిసి సోమవారం పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 25 వసంతాల గులాబీ సభ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు సభగా ప్రజలు అభివర్ణిస్తున్నారని, దేశానికి కరువు వస్తే తెలంగాణ నుంచి అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రాన్ని కేసీఆర్ తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఉద్యమాలకు పురిటిగడ్డయిన వరంగల్‌లో సభ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రేవంత్ పాలన సాగిస్తున్నారని, ఇంకా మూడున్నరేళ్ల కాంగ్రెస్‌ను ఎలా భరించాలంటూ ప్రజలు మనోవేదనకు గురవుతున్నారన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలు విసుగు చెంది తిరిగి కేసీఆర్ పాలనను బలంగా కోరుకుంటున్నారన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడంతో పాటు శ్రీశైలం నీటిని పక్క రాష్ట్రానికి తరలించి తెలంగాణను ఎడారిగా మార్చారని ఆరోపించారు. ఫలితంగా కేసీఆర్ పదేళ్ల కష్టం వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మోసగాళ్ల పాలనపై ప్రజల్లో విరక్తి : ఎర్రబెల్లి దయాకర్‌రావు

అధికారంలోకి రాగానే హామీలను నెరవేరుస్తామని చెప్పి అమలు చేయని మోసగాళ్ల పాలనపై ప్రజలు విరక్తి చెందారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. ఎల్కతుర్తిలో జరుగుతున్న బీఆర్ఎస్ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతిలో పెట్టామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. తిరిగి రాష్ట్రాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. 27న నిర్వహించే గులాబీ పండుగకు లక్షలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. రాష్ట్ర నాయకులు తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, నాగుర్ల వెంకన్న, చింతం సదానందం, మండల నాయకులు జడ్సన్, నగేష్, మహేందర్, స్వామి, శేషు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కళ్లు మూసుకున్నారా ?

- వేలాది ట్రిప్పుల మట్టి తరలింపుపై ఎందుకు సమాచారం లేదు
- కలెక్టర్, ఆర్డీవో, ఏడీ మైనింగ్ అధికారులపై ఫైర్
- సభ కోసం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రూ. 50 లక్షల డిమాండ్
- ఉద్యమం పేరుతో బీఆర్ఎస్ నాయకుల బెదిరింపులు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సభకు అక్రమంగా మట్టిని తరలిస్తుంటే కళ్లు మూసుకున్నారా ? అంటూ అధికారులపై వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ధ్వజమెత్తారు. సోమవారం ఎల్కతుర్తి మండల పరిధిలోని ఇందిరానగర్, సుర వైన్స్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కోసం వచ్చే వాహనాల పార్కింగ్ నిర్వహణలో భాగంగా పూడ్చిన దేవాదుల కాలువలను ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ సభకు ఎక్కడి నుంచి మట్టిని తరలించారు. ప్రభుత్వానికి ఎంత రాయల్టీ కట్టారని కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో రమేష్‌రాథోడ్, మైనింగ్ ఏడీలకు ఫోన్‌లో ఆరా తీశారు.

దీంతో తమ వద్ద ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, మట్టి తరలింపుపై తమకు సమాచారం లేదని అధికారులు బదులిచ్చారు. దీంతో మండిపడ్డ ఎమ్మెల్యే మట్టి తరలింపునకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు వెంటనే తెలియాలని డిమాండ్ చేశారు. తమ పరిధిలో జరుగుతున్న పనులపై సమాచారం లేకుండా ఎందుకు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. పెద్ద మొత్తంలో మట్టిని అక్రమంగా సభలకు తరలించడం, ప్రభుత్వ కాలువలు, వాగులను పూడ్చుతుంటే అధికారుల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. మట్టి తరలింపుపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వమన్నారు. రైతులకు నష్టం చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఉద్యమం పేరు చెప్పుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన పరిధిలో ఓ వ్యాపారిని సభ నిర్వహణకు రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించినట్లు ఆరోపించారు. దీనిపై ఫిర్యాదులు సైతం వచ్చాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ సంపదను ధ్వంసం చేశారన్నారు.

కాంగ్రెస్‌పై నిందలు మోపడం మానుకోవాలని హితవుపలికారు. బీఆర్ఎస్ సభను అడ్డుకోవాలనే ఆలోచన తమకు లేదన్నారు. సభకు అనుమతివ్వకుంటే కోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నామనడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యుడు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, నాయకులు సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, డాక్టర్ రమేష్, అంబాల శ్రీకాంత్, నవీన్, గొలిపెల్లి సంపత్, దుగ్యాల రాజేశ్వర్‌రావు, పెండ్యాల తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళా రైతు మృతి

- ఇది వడదెబ్బ మృతికాదు.. ప్రభుత్వ హత్యే
- ఆలస్యంగా కొనుగోళ్ల వల్లే మరణం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మృతి చెందిన ప్రేమలత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బతో మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలత రెడ్డి (58) మృతి చెందిన సంఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెర్లపాలెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ప్రేమలతరెడ్డి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలోని ధాన్యం నాలుగు రోజుల కిందట ఆరబోశారు. గత రెండు రోజులు ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమె సోమవారం అక్క డిక్కడే మృతి చెందారు. మృతురాలికి భర్త వెంకట్రాంరెడ్డి, కుమారుడు మహిపాల్‌రెడ్డి ఉన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మృతదేహం వద్దకు చేరుకొని వెంకట్రాంరెడ్డిని ఓదార్చి, ప్రభుత్వ పరంగా మహిళా రైతును ఆదుకుంటామని భరోసానిచ్చారు.



ప్రేమలత మృతదేహం

ఇది ప్రభుత్వ హత్యే.. : ఎర్రబెల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడదెబ్బతో మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలత రెడ్డి (58) మృతి వడదెబ్బ మృతి కాదని, ఇది ప్రభుత్వ హత్యేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెంకట్రాంరెడ్డిని ఓదార్చి మాట్లా డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొనుగోలు కేంద్రా లు ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో మృతి చెందిన రైతు కుటుంబా నికి ప్రభుత్వం క్షమాపణ చెప్పి రూ.20లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆ ర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ప్ర ధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

17 కిలోమీటర్లు.. సవాలక్ష సమస్యలు

- కాళేశ్వరం - మహదేవపూర్ రహదారికి గ్రహణం
- మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పరిష్కారం కాని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పుష్కరాలకొచ్చే భక్తులకు తిప్పలు తప్పనట్టేనా?

మహదేవపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల ప్రారంభం కానున్న సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అయితే.. కొన్ని సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు మూలుగుతున్నాయి. మూడేళ్లుగా నిధులు మంజూరైనా వాటికి మోక్షం కలగడం లేదు. సరస్వతీ పుష్కరాల సందర్భంగానైనా అవి పూర్తవుతాయనుకుంటే ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం- మహదేవపూర్ జాతీయ రహదారి పనులు ఏమాత్రం ముందుకు సాగడం లేదు. దీని నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. లక్షా 66 కోట్ల 82 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇంతవరకు పనులు ముందుకు సాగడం లేదు. దీంతో సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేదు. గుంతలమయమైన రహదారితో వారు అవస్థలు పడక తప్పదని తెలుస్తోంది. జాతీయ రహదారిపై గుంతలకు ప్యాచ్‌లు వేస్తూ కాలం వెల్లదీస్తున్నారు తప్ప అసలు సమస్యను పరిష్కరించడం లేదు.



కాళేశ్వరం - మహదేవపూర్ జాతీయ రహదారి

మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వెళ్లే జాతీయ రహదారి 17 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఇది పూర్తి కావడానికి వంద అడ్డంకులు, సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు నిధులు, ప్లాన్ అన్ని ఉన్నా అసలు అనుమతులు రాకుండా పనులు ఆగిపోయాయి. మొదటి దఫా అటవీశాఖ అధికారుల నుంచి క్లియరెన్స్, నో అబ్జక్షన్ నోటీసులు రావాల్సి ఉంది.. ఒకటి వచ్చి మరొకటి రాకపోవడంతో ఆ పనులు అక్కడే ఉన్నాయి. 17కిలోమీటర్లలో 15 కిలోమీటర్ల వరకు అటవీశాఖ అనుమతుల కోసం ఆగగా.. మిగతా రెండు కిలోమీటర్లు రోడ్డు విస్తీర్ణానికి రైతుల వద్ద నుంచి భూ సేకరణ సమస్య ఉంది. ఇటు భూ సేకరణ కావడం లేదు.. అటు అటవీశాఖ అనుమతులు రావడం లేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి? ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కరించి సరస్వతీ పుష్కరాల వరకైనా రహదారి పనులు పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

కోతుల బెడదతో బేజార్

కాళేశ్వరం- మహదేవపూర్ జాతీయ రహదారిలో ప్రమాదకరంగా ఏడు మలుపులు ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మలుపుల వద్ద సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు అంటున్నారు. వీటికి తోడు ఈ 17 కిలోమీటర్ల వరకు ఎక్కడా లేనివిధంగా కోతుల బెడద ఎక్కువగా ఉంది. భక్తుల వాహనాలు అటు వైపు వెళ్తే చాలు.. కోతులు వాహనాల మీద దూకి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి.. ద్విచక్రవాహనాలకు ముప్పు తప్పడం లేదు. కాళేశ్వరం పుష్కరాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కోతుల బెడద నుంచి కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన ఎంఆర్ఐ

- వారసత్వ భూమి పట్టా కోసం డబ్బులు డిమాండ్
- లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- జనగామ జిల్లా చిలుపూర్ మండలంలో ఘటన

చిలుపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వారసత్వంగా వచ్చిన భూమిని పట్టాచేయడం కోసం ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ చిలుపూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. జనగామ జిల్లా చిలుపూర్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన కలకలం సృష్టించింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆవుల బుచ్చయ్య 10 నెలల క్రితం చనిపోగా, అతని పేరిట 1.23 గుంటల భూమి ఉంది. ఈ భూమిని వారసత్వ పట్టా చేయడం కోసం అతని కుమారులు లింగయ్య, రాజయ్య పలుమార్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినీత్‌కుమార్‌ను సంప్రదించారు. భూమిని సర్వే, మ్యుటేషన్ చేయడం కోసం ఆర్ఐ వారిని డబ్బులు డిమాండ్ చేయగా దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న కారులో ఆర్ఐ రూ. 26 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడుల్లో సీఐలు సట్ల రాజు, ఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినీత్‌కుమార్

పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం



సువర్ణను సత్కరిస్తున్న సీపీ

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో రాణించే పోలీస్ క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. గత మార్చిలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 18వ జాతీయ పోలీస్ షూటింగ్ (స్పోర్ట్స్) చాంపియన్‌షిప్‌నకు తెలంగాణ తరుపున ప్రాతినిధ్యం వహించి 300మీటర్ల మహిళా జట్టు విభాగంలో సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్సై సువర్ణ సిల్వర్ మెడల్ సాధించింది. ఈ మేరకు మెడల్‌తో వచ్చి సీపీని సోమవారం కలవగా ఘనంగా సత్కరించి భవిష్యత్‌లో రాణించేందుకు సహకరిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

వాచ్‌మన్‌కు 20 ఏళ్ల జైలు

బాలికపై లైంగిక దాడి కేసులో శిక్ష ఖరారు

హసన్‌పర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 7వ తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్న హాస్టల్ వాచ్‌మన్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ అదనపు జిల్లా జడ్జి అపర్ణదేవి సోమవారం తీర్పు చెప్పారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు కథనం ప్రకారం.. వడ్డెపల్లి చర్చి సమీపంలోని ఎస్‌డీ ఆశ్రమ పాఠశాలలో తల్లిని కోల్పోయి ఉన్న బాధిత బాలిక చదువుకునేది. అదే పాఠశాలలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం రవినగర్‌కు చెందిన నిందితుడు ఆకుల సాంబ బాలికతో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి అభం శుభం తెలియని బాలికను వేములవాడకు తీసుకెళ్లి అక్కడి సత్రంలో పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. మోసం గ్రహించిన బాలిక సీతంపేటలోని తన మేనమామకు విషయం తెలిపింది. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై 2019 అక్టోబర్ 6న ఫిర్యాదు చేశారు. అప్పటి కాజీపేట ఏసీపీ రవీంద్రనాయక్ పోక్సో కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యుల్ని విచారించిన న్యాయమూర్తి సాంబకు 20సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు. అఘాయిత్యానికి గురైన బాలిక భవిష్యత్ కోసం రూ.4లక్షల ఆర్థిక సాయాన్ని బాలికకు ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి వాదించగా కోర్టు డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ వలబోజు రవీందర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు.

వడ దెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

సంగెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గీసగోని శ్రీదేవి(36) ఎండ, వడ దెబ్బకు మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. శ్రీదేవి ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లింది. ఎండవేడిమికి తాళ లేక వాంతులు, విరేచనాలు కావడంతో తోటి మహిళలు వెంటనే శ్రీదేవిని ఇంటికి తీసుకవెళ్లారు. విరేచనాలు అవుతున్న మహిళను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదే రోజు రాత్రి మృతి చెందారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.



శ్రీదేవి

పర్యావరణంలో పెనుమార్పులు

పెరుగుతున్న భూతాపంతో ఎన్నో అనర్థాలు



నేడు ధరిత్రి దినోత్సవం

- మేడారం అడవుల్లో టోర్నడో తరహా విధ్వంసం
- క్లౌడ్ బరస్ట్‌లు, భూప్రకంపనలతో భయంభయం
- 20శాతం తగ్గిన అడవుల విస్తీర్ణం
- 2మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

హనుమకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సమస్త జీవకోటి భారాన్ని మోసే ధరిత్రి తల్లడిల్లుతోంది. పర్యావరణంలో వస్తున్న పెనుమార్పులతో ఎన్నో విధ్వంసాలకు ఆలవాలమవుతోంది. అటు పర్యావరణ పరిరక్షణ.. ఇటు జీవనశైలిలోనూ వస్తున్న మార్పులతో భూపరిరక్షణపై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఇందులో నుంచి వచ్చిందే ప్రపంచ ధరిత్రీ దినోత్సవం. 1970 నుంచి ప్రారంభమైన ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా 190 కంటే ఎక్కువ దేశాల్లో ఏప్రిల్ 22న జరుపుకొంటున్నాయి. భూగోళంపై మానవ ప్రభావాన్ని తెలియజేయడం, అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. 2025 ఏడాదికి సంబంధించి 'మన వనరులు, మన భూగోళం' నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత దశాబ్దాకాలంలో పర్యావరణం పరంగా పెనుమార్పులు సంభవించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కుండపోత వర్షాలు (క్లౌడ్ బరస్ట్), వరదలు సంభవించడం, ఉమ్మడి జిల్లా చరిత్రలోనే మొదటి సారిగా ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతంలో టోర్నడో తరహా గాలులతో అడవిలో విధ్వంసం చెలరేగింది. అంతేకాదు ఇటీవల స్వల్పంగా భూమి కూడా కంపించడం.. దానికి మేడారం కేంద్రం కావడం ప్రత్యక్ష ఉదాహరణలు. మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని వాతావరణ పరిస్థితులు, చోటు చేసుకుంటున్న పరిణామాలు, అందుకుగల కారణాలు, ధరిత్రి పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో..:

భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు, నేల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతోంది. వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమవుతుందన్నది గుర్తించాలి. కానీ ప్రస్తుతం నానాటికీ పెరుగుతున్న భూతాపంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని జీవరాశి మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. ఈ పరిస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కనిపిస్తోంది. పదేళ్ల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వాతావరణంలో పెనుమార్పులొచ్చాయి. జనాభా పెరిగింది. పట్టణీకరణ ఊపందుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పల్లెలు కూడా కాంక్రీట్ జంగిళ్లుగా మారుతున్నాయి. ఫలితంగా పచ్చదనం కరువవుతోంది. అంతేకాదు రవాణా సౌకర్యాలు మెరుగుపడి రాకపోకలు పెరిగాయి. గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో వాహనాల సంఖ్య 35 శాతం పెరగ్గా.. ఆమేరకు కాలుష్యం కూడా రెట్టింపైంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు..

భూతాపం పెరగడం వల్ల ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత పదేళ్లలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 48 డిగ్రీలపైనే నమోదు అయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సాధారణ ఉష్ణోగ్రత 34.9 డిగ్రీ అయితే దానిని మించి రికార్డు స్థాయిలో 48.9 డిగ్రీలు నమోదయింది. మహబూబాబాద్ జిల్లాలో 48.5 డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 48.7 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో 47.6 డిగ్రీలు, ములుగు జిల్లాలో 48.5 డిగ్రీలు నమోదైంది.



గతేడాది భీకర గాలులకు తాడ్వాయి అడవుల్లో నేలకూలిన వృక్షాలు

తరగిపోతున్న అడవులు

అడవుల వల్ల విస్తృతంగా వర్షాలు కురిసి భూతాపం తగ్గుతుంది. పచ్చదనం వల్ల ఆ ప్రాంతమంతా చల్లగా ఉంటుంది. విస్తారమైన అడవులకు పేరున్న ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గత దశాబ్ద కాలంలో వాటి విస్తీర్ణం 20 శాతం మేరకు తగ్గిపోయినట్టు అంచనా. ప్రస్తుతం ములుగు జిల్లాలో 64.64 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 41.15 శాతం అడవి, మహబూబాబాద్ జిల్లాలో 26.49 శాతం మాత్రమే ఉంది. జనగామ జిల్లాలో 4.44 శాతం, వరంగల్ జిల్లాలో 3.53 శాతం, హనుమకొండ జిల్లాలో 3,40 శాతం మాత్రమే అటవీ ప్రాంతం ఉంది. విచక్షణా రహితంగా చెట్లను నరికి వేయడం వల్ల దాని ప్రభావం ధరిత్రిపై పడుతోంది.



పగబడుతున్న ప్రకృతి

ఉమ్మడి జిల్లాలో అయిదారు సంవత్సరాలుగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలను చూస్తుంటే ప్రకృతి పగబట్టిందా అన్న అనుమానం కలుగుతోంది. ఒకప్పుడు సాధారణ వర్షపాతం నమోదయ్యే ఉమ్మడి జిల్లాలో క్లౌడ్ బరస్ట్‌లు ఏర్పడి కుండపోత వర్షాలు పడుతున్నాయి. 2023 జులైలో కురిసిన భారీ వర్షాలతో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ఉమ్మడి జిల్లా చరిత్రలోనే తొలిసారిగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98 సెమీ, భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65, సెంమీల రికార్డు వర్షపాతం నమోదైంది. 2023జూలైలో వరంగల్ చరిత్రలో మొదటిసారి వాన బీభత్సంతో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగాయి. వరద ఉధృతికి తట్టుకోలేక చెరువులు, కుంటలు తెగిపోయాయి. గంటలకు 50 కిమీ వేగంతో గాలులు వీచాయి. ఇక గతేడాది మహబూబాబాద్ జిల్లాలో క్లౌడ్‌బరస్ట్ జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఇక గతేడాది ఆగస్టు31న ములుగు జిల్లా తాడ్వాయి-మేడారం అడవుల్లో టోర్నడో సంభించింది. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వీచిన ఆ సుడిగాలుల తీవ్రతకు మేడారం అడవుల్లో ఏడు కిలోమీటర్ల మేర అయిదు హెక్టార్ల పరిధిలో 50వేలకుపైగా చెట్లు నేలకూలాయి. ఇదిలా ఉంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూకంపాలు అరుదు. అలాంటిది గత సంవత్సరం డిసెంబరు 4న ఉదయం భూప్రకంపనలు సంభవించడం ప్రజలను తీవ్రభయాందోళనకు గురి చేసింది. ఉదయం 7.30గంటల సమయంలో భూమి కంపించగా.. అది మేడారం కేంద్రంగా వచ్చినట్టు రిక్టర్‌స్కేల్‌పై చూపడం మరింత ఆందోళన రేకెత్తించింది. ఇక 2023 ఆగస్టు 25న కూడా వరంగల్, హనుమకొండ, జనగామ ప్రాంతాల్లో స్వల్పంగా భూమి కంపించింది.



నేడు ఇనుపరాతి గుట్టల్లో వాకింగ్

ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని భూమిని పరిరక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక సంయుక్త అధ్వర్యంలో మంగళవారం దేవునూరిలోని ఇనుపరాతి గుట్టల్లో వాకింగ్‌ను నిర్వహిస్తున్నారు. అలాగు దేవునూరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ధరిత్రి పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు. ఉదయం 5.30 గంటల నుంచి గుట్టల్లో వాకింగ్‌ను చేపడతారు. పలువురు పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారు.

ధరణి రక్షణకు చర్యలు..

భూతాపం రోజు రోజుకు అంతకంతకు పెరుగుతుండడంతో పర్యావరణంలో పెనుమార్పులు సంభవించి ప్రకృతివైరీత్యాలు సంభవిస్తున్నాయి. దీని నివారణకు కొన్ని చర్యలు పాటిస్తే భూతాపం కొంత మేరకు తగ్గవచ్చు. కాలుష్య కారకాల నియంత్రిచడం, అడవులు, పచ్చదనం రక్షణ, కర్బన ఉద్గారాలు వెలువడే వాటిని నియంత్రించడం, పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించడం, వ్యర్థాల వినియోగం, పునర్వినియోగ ఇంధనాలు, వస్తువులను వినియోగించడం లాంటివి చేయాల్సి ఉంటుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలి.

ప్రకృతికి దగ్గరగా జీవించాలి



ధరణీ పరిరక్షణ, మానవాళి మనుగడకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి. ప్రస్తుతం ఏటా ప్రకృతి నుంచి 124 ట్రిలియన్ డాలర్ల విలువైన వనరులను వాడుతున్నాం. అవసరాలకు మించి 30 శాతం అధికంగా వినియోగిస్తున్నాం. ప్రకృతి వనరుల రీసైక్లింగ్ జరగడం లేదు. దీంతో వనరులు తరిగిపోతున్నాయి. గాలి, నీరు, నేల కలుషితమై పోతోంది. కాలుష్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా సాగుతోంది. పచ్చదనం తగ్గిపోతోంది. ఫలితంగా భూతాపం పెరిగిపోతోంది. ఇటీవల భూతాపం ఒకటిన్నర డిగ్రీలు పెరగడంతో అనేక జీవులు నశించి పోతున్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు పర్యావరణ హితంగా జీవించడం అలవరుచుకోవాలి.

- కాజీపేట పురుషోత్తం, రిటైర్డ్ జిల్లా అటవీ అధికారి అధ్యక్షుడు, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, జనవిజ్ఞానవేదిక, హనుమకొండ జిల్లా

కుంగిపోవద్దు.. కన్నీరు మిగల్చొద్దు..

మార్కులెలా వచ్చినా మనోధైర్యం చెడొద్దు

- ఫెయిలైనా ఆత్మస్థైర్యంతో ముందడుగేయాలి
- పరీక్షల ఫలితాల వేళ పిల్లలను తల్లిదండ్రులు ఓదార్చాలి



వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. మంగళవారం ఇంటర్ ఫలితాలు, ఆ తర్వాత మరో వారం రోజుల్లో పదో తరగతి ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలో పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని అలవాటు చేయాల్సి ఉంది. చిన్నచిన్న కారణాలతోనే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు పిల్లలు. అలాంటిది తాము ఎంతో కష్టపడి చదివిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైతే.. లేదంటే ఇతరుల కంటే మార్కులు తక్కువగా వస్తే.. కొందరు ఒక్కసారిగా ధైర్యం కోల్పోతారు. చిన్నతనంగా భావిస్తారు. అమ్మానాన్నలు తిడతారానో.. బంధువుల్లో చుట్టుపక్కల వారిలో తలెత్తుకుని తిరగలేమనో.. క్షణికావేశంలో తీసుకోరాని నిర్ణయం తీసుకుంటే.. అది ఆ కన్నవారి తీరని శోకమే మిగుల్చుతుంది. అందుకే పరీక్షల ఫలితాలు ఎలా ఉన్నా పిల్లలు కుంగిపోవద్దని, మార్కులు, ఫలితాలే పరమావధి కాదన్న విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పాలని మానసిక, మనో వికాస నిపుణులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువగా వచ్చినా పిల్లలను ఏమీ అనకుండా వారికి అండగా నిలవాలని.. అనుకున్న మార్కులు రాని వారికి ఇంప్రూవ్‌మెంట్, ఫెయిలైన వారికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయన్న ధైర్యం కల్పించాలని చెబుతున్నారు. అందుకే ముందుగానే పిల్లలను ఆ దిశగా సిద్ధం చేయాలని సూచిస్తున్నారు. అలాగే చుట్టుపక్కల వారు, బంధువులు కూడా పిల్లల మార్కులు, ఫలితాల గురించి బేరీజు వేయడం, హేళన చేయడం, ఒకరికొకరికి పోలికలు పెట్టడం లాంటివి చేయకుండా ఉండాలని చెబుతున్నారు. ఇక స్నేహితులు, తోటి విద్యార్థులు కూడా మార్కులు తక్కువవచ్చిన, ఫెయినలైన విద్యార్థులకు అండగా ఉండి ధైర్యం చెప్పాలని, లేదంటే వారికి తగినంత సాయం చేయాలని సూచిస్తున్నారు.



గతానికి ఇప్పటికీ ఎంతో మార్పు..

ఒకప్పుడు పదోతరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిపోతే ఏడాదంతా వృథా అయ్యేది. సెప్టెంబరులో సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసైతే వచ్చే ఏడాదికి ప్రమోట్ అయ్యేవారు. కానీ అలా విద్యాసంవత్సరం వృథా అవకుండా ఉండేందుకు ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఫలితాలు వచ్చిన నాటినుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందుకే ఫెయిలైనంత మాత్రాన పోయేదేం లేదని వెంటనే పరీక్షలు రాసి పాసవ్వచ్చన్న విషయాన్ని పిల్లలకు వివరించి ధైర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందులో ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని చెబుతున్నారు. ఓటమి నుంచి విజయాలు పొందిన గొప్ప వారి చరిత్రను పిల్లలకు చిన్నతనం నుంచే వివరిస్తూ ఉండాలని సూచిస్తతన్నారు.

విద్యార్థులూ.. తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగల్చొద్దు

పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, ఫెయిల్ అయ్యామనే ఆత్మన్యూనతతో క్షణికావేశానికి గురికావొద్దు. ఫెయిల్ అయినా ధైర్యంతో ముందుడుగేయాలి. ఫలితాలు వెలువడిన కొద్ది రోజుల్లోనే నిర్వహిస్తున్న ఇన్‌స్టంట్ పరీక్షలపై దృష్టి పెట్టాలి. ఫలితాలు ప్రతికూలంగా వస్తే కుంగిపోయి అఘాయిత్యాలకు పాల్పడి తల్లిదండ్రులను దుఃఖాన్ని మిగల్చొద్దు. ఆత్మస్థైర్యంతో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేలా కృషి చేస్తే.. విజయాలు మీ చెంతకు అవే చేరుతాయనే విషయాన్ని గ్రహించాలి.

విద్యార్థులూ కుంగిపోవద్దు..



ఫలితాలను చూసి విద్యార్థులు కుంగిపోవద్దు. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువ వచ్చినా వాటిని విశ్లేషించుకోవాలి. అందుకు కారణాలు వెతుక్కొని వాటిని అధిగమించేలా ప్రయత్నాలు ప్రారంభించాలి. అంతే తప్ప ఫెయిల్ అయ్యామని ప్రాణాలు తీసుకోవద్దు. ప్రతీ విద్యార్థిలోనూ విజ్ఞానం దాగి ఉంటుంది. దానిని సరైన పద్ధతిలో బయటకు తీసుకురావాలి తప్ప ఒక్క సారి ఫెయిల్ అయితే జీవితమే అయిపోయిందనే భావనలో ఉండకూడదు. ప్రతీ ఓటమి విజయానికి అవకాశంగా మార్చుకొని ముందుకు సాగాలి.

- డాక్టర్ బరుపాటి గోపి, అధ్యాపకులు, మనోవికాస నిపుణులు...

ఒత్తిడిని జయించాలి..



ఫలితాల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు. ఒత్తిడికి గురైనా దాన్ని జయించాలి. సాధారణ పరిస్థితుల్లో లాగానే వ్యవహరించాలి. ఉత్తీర్ణత సాధించేందుకు ముందు నుంచే ప్రణాళిక బద్ధంగా చదవాలి. అప్పుడు ఫలితం ఎలా ఉండబోతుందో ముందే తెలిసిపోతుంది. అలాంటప్పుడు ఆత్మన్యూనతకు గురికావాల్సిన అవసరం రాదు. ఫెయిల్ అయితే మళ్లీ పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంది. కానీ ప్రాణాలు తీసుకుంటే తల్లిదండ్రులకు శోకమే మిగులుతుంది.

- పోగు అశోక్, ఉపాధ్యాయుడు, మోటివేషనల్ స్పీకర్

బీజేపీది గాడ్సే సిద్ధాంతం

- అదానీ, అంబానీలు రూ.21 లక్షల కోట్లను మాఫీ చేశారు
- రైతులకు రుణమాఫీ చేయడానికి చేతులు రాలేదు
- స్వేచ్ఛ, సమానత్వాల పరిరక్షణకు రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి
- ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపులో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీది గాడ్సే సిద్ధాంతమని ఆ మేరకే పాలన సాగిస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను రగల్చడమే అజెండాగా పెట్టుకొందని దుయ్యబట్టారు. హనుమకొండ హరితా హోటల్‌లో జరుగుతున్న 'ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్' మూడవ రోజు సోమవారం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన సమ్మేళన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో శాంతియుత పరిస్థితులకు విఘాతం ఏర్పడిందన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ భయానక పాలన సాగిస్తోందని విమర్శించారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు, రైతులకు రుణమాఫీ చేయడానికి బీజేపీకి చేతులు రాలేదన్నారు. అంబానీ, అదానీ వంటి బడాబాబులకు మాత్రం రూ.21 లక్షల కోట్లను మోదీ ప్రభుత్వం మాఫీ చేసిందని విమర్శించారు.

బాపు, అంబేడ్కర్ ఆలోచనల సమ్మేళనమే కాంగ్రెస్ :

జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఆలోచనల సమ్మేళనమే కాంగ్రెస్ అని సీతక్క పేర్కొన్నారు. బీజేపీ అగ్రవర్ణాలు, పెత్తందార్లకు కొమ్ము కాస్తుంటే..తమ అధినేత రాహుల్ గాంధీ నిరుపేదల సంక్షేమం, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని హరించేందుకు బీజేపీ యత్నిస్తుంటే పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు. అణగారిన వర్గాలను అందెలం ఎక్కించ డమే రాహుల్ గాంధీ లక్ష్యాల్లో ఒకటన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. సమ్మేళన్ శిక్షణ కార్య క్రమంలో వివిధ అంశాలపై కలిగిన అవగా హనను గ్రామలలో విస్తరించాలని సూచించారు.

తెలంగాణలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను డంప్ చేశారు.

30 వేల మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను బీజేపీ తెలంగాణలో డంప్ చేసిందని సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు వెల్లడించారు. బీజేపీ కుట్రలను చేధించడానికి గ్రామ స్థాయి నుంచి వాస్తవాలను వివరించే పనిలో ఆదివాసీలు నిమగ్నం కావాలని సూచించారు. ఆదివాసీలను చైతన్య పరిచి నాయకత్వాన్ని ఉత్పత్తి చేసే లక్ష్యంతో సమ్మేళన్ చేపట్టడం జరిగిందన్నారు. తెలంగాణ నుంచే సమ్మేళన్ శిక్షణ తరగతులు చేపట్టడానికి ఈ ప్రాంతానికి ఉన్న పోరాట చరిత్రే కారణమన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం గొప్ప ఘట్టమన్నారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అదే విధంగా జూన్ 2 నుంచి ఆగస్టు 15 వరకు రెవెన్యూ సదస్సులు జరుగనున్న క్రమంలో ఆదివాసీలు సిద్ధం కావాలన్నారు. భూ భారతీ చట్టంపై సంపూర్ణ అవగాహన ఏర్పర్చుకొని సదస్సుల్లో భూ సమస్యలు ఎదుర్కొంటున్న ఆదివాసీలకు పరిష్కార చర్యల్లో సహాయ, సహకారాలు అందించాలన్నారు. బీఆర్‌యస్ ఓటమికి ధరణీ లోపాలే ప్రధాన కారణమని కొప్పుల రాజు వెల్లడించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ ముగింపులో శిక్షణలో పాల్గొన వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శిక్షణ సర్టిఫికెట్లను అందచేశారు. సమ్మేళన్ ప్రారంభానికి ముందు హరితా హోటల్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు 'జై బాపు-జై భీమ్-జై సంవిధాన్-జై జగత్' ర్యాలీలో మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కావ్య తదితరులు పాల్గొన్నారు. మైదానంలో శ్రమదానం చేసి శుభ్రం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు విక్రంత్ బునియా, ఉపాధ్యక్షుడు బెల్లయ్యనాయక్, ఎంపీ బలరాంనాయక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, సమ్మేళన్ ఇన్‌చార్జి రాహుల్ బాల్, కో-ఆర్డినేటర్ చంద్రకళ, ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి బంగారు కానుక

రూ. 4 లక్షల విలువైన తాళిబొట్టు అందజేసిన భక్తుడు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళి అమ్మవారికి ఓ భక్తుడు బంగారు కానుక అందించారు. హనుమకొండకు చెందిన మాధవ్ అనే వ్యక్తి ఓవైపు ప్రభుత్వం ఉద్యోగం చేస్తూనే మరో వైపు గ్రూప్ -1 పరీక్ష రాశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు వచ్చినందున ఆనందంతో అమ్మవారికి రూ.4 లక్షల విలువ చేసే బంగారు తాళి బొట్టును తయారు చేయించి సోమవారం ఈవో శేష భారతి చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు.

మండే ఎండలో.. ఏమి హాయిలే ఇలా..



ఎవరూ లేరు ఈ నీళ్లలో దిగుదాం..



అహా చల్లగా ఉంది..



అబ్బా ఎవరో వస్తున్నారే..



హమ్మయ్య ఎంత హాయిగా ఉందో..

ఎండలు దంచి కొడుతుండటంతో మనుషులే కాదు పశుపక్షాదులు కూడా అల్లాడుతున్నాయి. అందుకు నిదర్శనమే ఈ చిత్రాలు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ఓ కోతి ఎంచక్కా నీటి తొట్టిలోకి దిగి జలకాలాడింది. హమ్మయ్య చల్లగా ఉందంటూ బయటకొచ్చి కేరింతలు కొట్టింది. ఈ దృశ్యాలు వాజేడు మండల కేంద్రంలోని ఓ ఇంట్లో సోమవారం కనిపించాయి.

- వాజేడు, ఆంధ్రజ్యోతి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

డోర్నకల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అన్నారు. సోమవారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు గ్రేసమ్మ పదవీ విరమణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, టీసీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామ వెంకటేశ్వర్లు, వివేక్ , ఎంఈవో లక్ష్మా, ఉపాధ్యాయులు రుక్మాంగదరావు, వీరభద్రరావు, విత్తనాల సుధాకర్, అప్పిరెడ్డి, రిజ్వాన, మున్నీ, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో



గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 63 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ(33), మునిసిపాలిటీ (07), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (05), ఎంప్లాయిమెంట్ (03), ఇతర శాఖలకు సంబంధించి మొత్తంగా 63 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌పై ఎంతో నమ్మకంతో ప్రజలు దూరప్రాంతాల జిల్లా కేంద్రానికి వచ్చి దరఖాస్తులను అందిస్తారని వాటిని పెండింగ్‌లో ఉంచకుండా క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు ఆర్డీవో గణేష్, జిల్లా అధికారులు పురుషోత్తం, మధూసూదనరాజు, సుబ్బారావు, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, మరియన్న, నర్సింహస్వామి, శ్రీనివాసరావు, కృష్ణవేణి, సురేష్, శ్రీమన్నారాయణ, వీరన్న, సత్యనారాయణ, మోహన్, విజయ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మరిపెడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి అందుకు కారకులపై కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీష్‌గౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సోమవారం రాత్రి మండలంలోని బీచ్‌రాజ్‌పల్లికి చెందిన చిదుముల విజయ్, బాల్నిధర్మారానికి చెందిన గుడిమల్ల ఉపేందర్, చిన్నగూడూరు మండలం విస్సంపల్లికి చెందిన బొమ్మ రవి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నారు. పోలీస్ పెట్రోలింగ్‌లో వీరికి చెందిన ఇసుక ట్రాక్టర్లు పట్టుపడగా వాటిని సీజ్ చేసి నింధితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

దంతాలపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులకు ధాన్యం ఇచ్చి మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాముగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని బీరిశెట్టిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏఎమ్సీ భట్టునాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రిసోర్స్‌పర్సన్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయిలో సబ్జెక్టు రిసోర్స్‌పర్సన్‌ల నియామకాలకు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 24న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎంపికైన ఉపాధ్యాయుల వివరాలను ఈ నెల 28న ప్రకటించబడుతాయని తెలిపారు. ఇతర వివరాలకు క్వాలిటీ కో-ఆర్డినేటర్ 98661 08880ను సంప్రదించాలన్నారు.

తక్షణమే కాంటాలు నిర్వహించాలి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు నిర్వహించాలని (ఏఐకేఎంఎస్ అనుబంధ సంఘం) రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఖానాపురం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ధాన్యం తీసువచ్చి 20 రోజులు గడుస్తున్న కాంటాలు నిర్వహించకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనని ఆరోపించారు. ఆయన వెంట షైపాష, ఈదునూరి సోమన్న, యాకాంత రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తీగలవేణి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఫారూక్ అన్నారు. గూడూరు మండలం తీగలవేణి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రేన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆనంద్, యాకయ్య, సక్రు, రాంలాల్, షాహిన్‌సుల్తాన, నమల్వార్, ధర్మానాయక్, పురుషోత్తం, సాంబయ్య, సంపత్, నాగరత్న, రవి, రఫీ, లక్ష్మయ్య, మహేందర్, ప్రభాకర్, సరస్వతి, ఆకాష్, యాకూబ్, కుసుమకుమారి, సుష్మిత, సాయిలు, మధుకర్, అఖిల్‌పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం

దంతాలపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యం లో మండలంలోని దాట్లతో పాటు పలు గ్రామాల్లో ఈజీఎస్ పని ప్రదేశాల్లో కూలీల వద్ద సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమ ంలో ఆ సంఘం మండల కార్యదర్శి రమేశ్వరం, నాయకులు వెంకటరాం నర్సయ్య, రజిత, పద్మ, గోపమ్మ, లచ్చమ్మ, నగేష్ వీరన్న పాల్గొన్నారు.

పోరాట జిల్లా కార్యదర్శిగా మెరుగు మల్లేశం

తొర్రూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జిల్లా కార్యదర్శిగా తొర్రూరుకు చెందిన మెరుగు మల్లేశంగౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రమేష్ సోమవారం తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మల్లేశం గౌడ కులస్తులకు చేస్తున్న సేవలను గుర్తించి నియమించామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, రాందాస్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

27న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలి

పెద్దవంగర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు రామదండులా కదలిరావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. సోమవారం మండలంలోని శంకర్‌తండా, మోత్యతండా, కొరిపెల్లి గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలను ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీరాం సంజయ్, వెంకన్న, దుంపల సమ్మయ్య, సత్యనారాయణ, ముజీపుద్దీన్, హరీష్, అంజనేయులు, కృష్ణారెడ్డి, నవీన్, యాకన్న, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం



ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులు శేరి వీరయ్య పాఠశాల అభివృద్ధి కోసం రూ.20 వేల చెక్కును పాఠశాల హెచ్‌ఎం గుగులోతు లక్ష్మికి సోమవారం అందించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు ఆవునూరి రవి, రాధిక, సువర్ణ, కవిత, శ్రీజ, రామసహాయం శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

నెల్లికుదురు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :మునిగలవీడు గ్రామంలో వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు మునిగలవీడు స్టేజీ వద్ద రోడ్డుపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఇసంపెల్లి సైదులు మాట్లాడుతూ గత వారంరోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో నల్లాని పాపరావు, దుస్సయాకయ్య ఉగదేవేందర్, తుప్పతురి నాగన్న, ప్రవీన్, శేఖర్, నాగయ్య, శ్రీశైలం, తూము వెంకన్న, వీరస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

కంబాలపల్లి పీహెచ్‌సీ తనిఖీ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని సోమవారం డీఎంఅండ్‌హెచ్‌వో భూక్య రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులు, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వేసవికాలం దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఓఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేసి వడదెబ్బకు గురికాకుండ అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి సాగర్, ప్రసాద్, రాజు, మేరి, నరేష్, చక్రి, పుష్పలత పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



ధర్నాలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయసారథి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కార్పోరేట్ శక్తులు ఆదానీ, అంబానీలకు మెప్పు కోసమే ప్రధాని మోదీ పని చేస్తున్నారే తప్ప ప్రజా సంక్షేమానికి పని చేయడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి విమర్శించారు. వంట గ్యాస్, అన్ని రకాల సరుకుల అధికధరలను నియంత్రించాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ తహసీల్ ఆఫీసు ఎదుట సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ గత పదేళ్లుగా పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. ప్రధాని మోదీ కేవలం కార్పోరేట్లకే ప్రధాని అన్నట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కాగా ఈ ధర్నాకు ముస్లీం, మైనార్టీ కమిటీ బాధ్యులు సంఘీభావం ప్రకటించారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్‌సారధిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, శేఖర్, శ్రీను, ఫాతిమా, శ్రావణ్, అశోక్, చిరంజీవి, ముస్లీం కమిటీ బాధ్యులు మహ్మద్ ఇక్బాల్, ఫరీద్, రియాజ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల వైద్య విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బహుజన మేధాని డాక్టర్ వివేక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, హాస్టల్ భవనాలను సోమవారం సందర్శించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్‌ను కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధి , హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న మెనూ మొదలగు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్, విష్ణునాయక్, ఎల్ఎస్వో జిల్లా అధ్యక్షుడు శివవర్మనాయక్, డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు శాంతికుమార్, సూర్యప్రకాష్, దీపక్, వినయ్, తరుణ్, అజయ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంగారావు తదితరులు

కేసముద్రం, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని ధన్నసరి క్రాస్‌రోడ్డు వద్ద ధన్నసరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమ వారం సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నీలం దుర్గేష్, మాజీ సర్పంచ్ సేవేందర్ పాల్గొన్నారు. కాట్రపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో సొసైటీ డైరెక్టర్ జల్లె ఏలియా, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, జల్లె యాకాంబ్రం, ఎదురబోయిన సూరయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని గూడూరు మాజీ జడ్పీటీసీ నాయిని ధర్మారెడ్డి అన్నారు. గూడూరు మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడారు. సమావేశంలో జిల్లా నాయకులు పొదిళ్ల నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ చెల్పూరివెంకన్న, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్, అప్పరాజుపల్లి మాజీ సర్పంచ్ విజయశ్రీ, చెల్పూరి శ్రీశైలం, నాగేశ్వర్‌రావు, నాగరాజు, రవి, సంపత్, అనిల్, సురేష్, దేవేందర్, కత్తి వెంకన్న, భద్రునాయక్, బోడ వెంకన్న పాల్గొన్నారు.

మహిళలకు అండగా కాంగ్రెస్ పార్టీ



కాంగ్రెస్‌లో చేరిన వారితో హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో మహిళా విభాగ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమానికి ఆకర్షితులై మండ లంలోని వెలికట్టె గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు దేశగాని భిక్షపతి, కొండల్‌రెడ్డి, ఎమ్డీ.యూసఫ్, విష్ణువర్ధన్‌లు ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, రాంచంద్రయ్య, సురేందర్ రెడ్డి, కుమార్, వెంకన్న, యాకన్న తదితరులు ఉన్నారు.

షాదీఖానా మంజూరు పట్ల ముస్లింల హర్షం

కేసముద్రం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలంలో షాదీఖానా నిర్మాణానికి రూ.80లక్షలు కేటాయించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ అర్పనపల్లిలో సోమవారం సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని ముస్లింలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో షాదీఖానా నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, కుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఖాదర్, జావిద్, అక్బర్, ఎండీ.అల్లావుద్దిన్, నయీం, ఎండీ.హఫీజ్ పాల్గొన్నారు. కేసముద్రంలో క్రైస్తవుల శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమాధులతోటను ఏర్పాటు చేయాలని అర్పనపల్లిలో వేం నరేందర్‌రెడ్డికి మండలంలోని క్రైస్తవులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్ మహబూబ్, లాల్‌సింగ్ జోసెఫ్, జాన్ వెస్లి, థామస్, పుల్లెంల శ్రీధర్, దేవరాజ్, డేవిడ్‌రాజు, ప్రవీణ్, బనిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మనోవికాసం..

తొర్రూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు స్నేహాన్ని పెంపొందిస్తూ మనోవికాసానికి దోహదపడతాయని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆహ్వానిత వాలీబాల్ క్రీడల ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వాలీబాల్ క్రీడల్లో ప్రథమ బహుమతి రఘునాథపల్లి టీమ్, ద్వితీయ బహుమతి మేడారం టీమ్, తృతీయ బహుమతి కొత్తగూడ టీమ్ సభ్యులు గెలుచుకున్నట్లు తెలిపారు. వారందరికీ నగదు బహుమతి అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సూరం ఉపేందర్ రెడ్డి, వి.ప్రవీణ్ రెడ్డి, జనార్దన్, ఎంఈవో బుచ్చయ్య, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఆదిరెడ్డి ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో జరుగుతున్న ఘటనపై విచారణ జరిపించాలి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వరుసగా జరుగుతున్న ఘటనలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వాసునాయక్ మాట్లాడారు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఓ బాలిక అదృశ్యమైన ఘటన పై విచారణ జరిపి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడ రమేష్, భూక్య బాలాజీనాయక్ ఉన్నారు.

టీసేఫ్ యాప్‌పై అవగాహన

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో సోమవారం షీటీమ్ ఆధ్వర్యంలో టీసేఫ్ యాప్‌పై అవగాహన కల్పించినట్లు షీటీమ్ ఎస్సై సునంద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీసేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవ్వగానే మానిటరింగ్, డయల్ 100 ఆప్షన్స్ కన్పిస్తాయని చెప్పారు. మానిటరింగ్ నొక్కి. చేరుకోవాల్సిన ప్రదేశం, వెళ్తున్న వాహనం వివరాలు అందిస్తే పర్యవేక్షణ మొదలవుతుందన్నారు. అవసరమయితే 100 బటన్‌పై క్లిక్ చేస్తే పోలీసులు అలర్ట్ అవ్వడమే కాకుండా మీ లోకేషన్ ఆధారంగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వివరాలు వెళ్తాయని చెప్పారు. 5 నిమిషాల్లో పోలీసులు మీ మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేస్తారని, మీరు ఒకవేళ మీరు స్పందించకపోతే మీ లోకేషన్‌కు వస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంవో జగదీష్, ఏవో గఫర్, షీటీమ్ సిబ్బంది అరుణ, పార్వతి, రమేష్, ఏహెచ్‌టీయూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మ కమిటీతో రైతులకు మెరుగైన సేవలందాలి

మరిపెడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆత్మ కమిటీతో రైతాంగానికి మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మరిపెడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, మరో 23మంది కమిటీసభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఏడీఏ విజయచందర్ మండల ంలోని గిరిపురం రైతు వేదికలో ఏర్పాటు చేయగా ఆ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మరిపెడ వ్యవసాయ డివిజన్‌కు చెందిన తొమ్మిది మండలాల ఎంఏవోలు, ఏఈవోలు, కాంగ్రెస్, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

గీత కార్మికులను బహిష్కరించిన వారిని శిక్షించాలి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఎర్రగడ్డ మండలం తాళ్ల రాంపురంలో కల్లుగీత కార్మికులను సాంఘీక బహిష్కరణ చేసిన విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ)లను రద్దు చేసి వారిని కఠినంగా శిక్షించాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్నిఅందించారు. బిక్షి వెంకటేశ్వర్లు, యమగాని వెంకన్న, సమ్మెట రాజమౌళి, నక్క నాగార్జున, కుమ్మరికుంట్ల నాగన్న, రావుల రాజు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో పేదలకు సంక్షేమ ఫలాలు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పలాలు అందాయని రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో గూడూ రు మండలం దామెరవంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ యూత్ అర్బన్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్‌నాయక్, భరత్, రాజు, నవీన్, సమ్మయ్య, ప్రశాంత్, సందీప్, రాకేష్ పాల్గొన్నారు.

కొత్తగూడలో భారీ వర్షం

కొత్తగూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :కొత్తగూడ మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 10.8మీమీ వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి గాలి, దుమారంతో భారీ వర్షం కురిసింది. ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై వరద నీరు ప్రవహించింది.

ప్రాజెక్ట్ పనుల్లో అక్రమాలపై విచారణ జరపాలి

గార్ల మార్చి 21 ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిపై నిర్మాణమవుతున్న సీతారామ ప్రాజెక్ట్ మొదటి దశ పనుల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. సోమవారం సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈప్రాంత రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జాన్సీ సత్యానారాయణ, జాన్సీ సాటర్ బాబు, సలీం, యాకుబ్, మాన్య నాయక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధ్యాయుల బడిబాట

కేసముద్రం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కల్వలలో సోమవారం జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి 14 మంది విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం బండారు నరేందర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా పీఎస్‌హెచ్‌ఎం కళ్లెం వీరారెడ్డి ఉపాధ్యాయులు గోపి, స్వరూప, హరికృష్ణ, శ్రీదేవి, మోహనకృష్ణ పాల్గొన్నారు. అన్నారంలో నిర్వహించిన బడిబాటలో హెచ్‌ఎం బి.శ్రీధర్, ఉపాధ్యాయులు శ్రీనివాసశర్మ, సోని, భద్రయ్య, సత్యనారాయణ, దీపిక పాల్గొన్నారు.

27న పూలే, అంబేద్కర్ జనజాతర సభ

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ఐఎంఏ బిల్డింగ్‌లో ఈనెల 27న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ జనజాతర సభను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, సీపీఎం మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య తెలిపారు. మహబూబాబాద్ శివారు గుమ్మానూరులో సోమవారం పూలే, అంబేద్కర్ జనజాతర సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సభకు కేయూ ప్రొఫెసర్ గడ్డం కృష్ణ, పొలిటికల్ లెక్చరర్ పీరోజీ గణేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాదుల శ్రీనివాస్ హాజరవు తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చీపిరి యాకయ్య, సూర్నపు రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మరిపెడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటదని మరిపెడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి అన్నారు. సోమవారం మరిపెడ మునిసిపల్ పరిధికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు స్థానిక మునిసిపల్ కమ్యూనిటీ భవన్‌లో పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ఏఎన్‌ఎం నర్సుబాయి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత పెంపొందించుకోవాలి

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు జాతీయ సమైక్యతను పెంపొందించుకో వాలని గూడూరు ఎంఈవో జె.రవికుమార్ అన్నారు. గూడూరు మండలం అయోధ్యపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏక్‌భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు హర్యానా రాష్ట్ర సాంప్రదాయ దుస్తులను ధరించి ఆ రాష్ట్ర వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, జ్యోతిరాణి, కల్యాణి, రాణి, షాహీద్‌ఆలీ, జగదీశ్వర్, చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమెరికా వైస్ ప్రెసిడెంట్ పర్యటన విరమించుకోవాలి

బయ్యారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడే వాన్స్ భారత పర్యటన న ఇరసిస్తూ బయ్యారంలో సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రైతు సంఘాల నాయకులు వాన్స్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాడి పరిశ్రమ, వాణిజ్య ఒప్పందాలు, రైతు వ్యతిరేక ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశవర్లు, రాజన్న , సూర్యం, మధు, ఐలయ్య పాల్గొన్నారు.

19 కిలోల గంజాయి పట్టివేత



మహిళ అరెస్టు చూపుతున్న పోలీసులు

డోర్నకల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో 2వ నెంబర్ ఫ్లాట్‌ఫాంపై సోమవారం ఓ మహిళ వద్ద నుంచి 19 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకా రం.. రైల్వే జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డోర్నకల్ రెండో నెంబర్‌ప్లాట్‌పై సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ప్లాట్‌ఫాంపై ఓ మహిళ బ్యాగుతో అనుమానస్పదంగా కన్పించడంతో బ్యాగును తనిఖీ చేశారు. ఆ బ్యాగులో 19 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సుమారు దీని విలువ రూ. 4.75 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. సదరు మహిళ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదా బాద్ జిల్లాకు చెందిన మొల్ల నర్గీస్‌బాబీగా చెప్పారు. గంజాయితో పాటు మహిళను అదుపులోకి తీసుకుని ఖమ్మం జీఆర్పీ సీఐ అంజలికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

గంగాభవానీ జాతరకు పోటెత్తిన భక్తులు



తానంచర్ల గంగాభవానీ జాతరకు పోటెత్తిన భక్తులు

మరిపెడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తానంచర్ల గంగాభవానీ జాతరకు సోమవారం భక్తులు పోటెత్తారు. గంగమ్మతల్లికి బోనాలు, గంప మొక్కులు చెల్లించి హోరెత్తిన సంబరాలు జరుపుకున్నారు. భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్న తానంచర్ల గంగాభవా దేవతకు సమీప గ్రామాల్లోని ఊర్లకు ఊర్లు ఇంటిల్లిపాదులతో జాతరకు తరలివచ్చి చెట్టు చెట్టుకు విడిది ఏర్పాటు చేసుకున్నారు. దేవతకు కోళ్లు, మేకలు, గొర్రె పోతులను బలిచ్చి బంధుమిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణం మొత్తం డోలు, డప్పు వాయిద్యాలతో మోత మోగింది. జాతర నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా మరిపెడ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. డోర్నకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు జాటోత్ రాంచంద్రునాయక్, మందుల స్యామేల్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండుతున్న ఎండల నుంచి భక్తులకు ఉపశమనం కలిగించడానికి తానంచర్ల గంగాభవానీ ఆలయ ధర్మకర్తలు రామసహాయం సత్యనారాయణరెడ్డి, తేరా ప్రభాకర్‌రెడ్డి ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి వెంట ఆనంద్‌రెడ్డి, బొల్లెపల్లి వెంకన్న, పాశం నరేష్‌రెడ్డి, ఎంపీవో సోమ్లానాయక్, పంచాయతీ సెక్రటరీ మౌనిక, సీత వెంకన్న, గణేశ్, భగవంతాచారి, రామన్న, సోమన్న, తేజావత్ రవి ఉన్నారు.